క్లుప్తంగా

రేషన్ కార్డుల పంపిణీ



రేషన్ కార్డులు అందజేస్తున్న నాయకులు

బూర్జ: మండలంలోని తోటవాడ గ్రామ సచివాలయం పరిధిలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను మండలం సచివాలయ కన్వీనర్ గుమ్మడి రాంబాబు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల లబ్ధిదారులకు ప్రస్తుత ప్రభుత్వంలో పార్టీలకతీతంగా పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామ సర్పంచ్ సూర ఆనందరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

చేపల మార్కెట్ వేలం ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

నరసన్నపేట: స్థానిక మేజరు పంచాయతీలో ఆశీల వేలంపాటను డీఎల్‌పీఓ ఆర్. గోపీ బాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. దీంట్లో చేపల మార్కెట్ ఆశీలు ఖరారు అయ్యాయి. సర్కార్ పాట రూ.2.45 లక్షల కాగా.. పట్ట లక్ష్మీనారాయణ రూ.3.30 లక్షలకు పాడారు. దీనిని అధికారులు ఖరారు చేశారు. రోజువారీ మార్కెట్, వారపు సంత, కారు అండ్ బస్టాండ్ ఆశీలకు పాటలను నిర్వహించగా.. పాటదారులు ఆసక్తి చూపకపోవడంతో వీటిని వేలంను అధికారులు వాయిదా వేశారు. సర్పంచ్ బూరల్లి శంకర్, ఈఓపీఆర్డీ రామకృష్ణారావు, వార్డు సభ్యుడు కేసీహెచ్‌బీ గుప్త, ఈఓ సవర చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ



గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

నరసన్నపేట: నెల్లూరులో అమీర్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో డిసెంబర్‌లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో మండలంలోని దేశవానిపేట ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో ముగ్గురు విద్యార్థులు గోల్డ్ మెడల్స్ పొందారని, మరో 22 మందికి మెరిట్ సర్టిఫికెట్స్ వచ్చాయని హెచ్ఎం ఎస్.జయరావు బుధవారం తెలియచేశారు. చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, డ్రాయింగ్ టీచర్ రాజేష్ కుమార్‌ను అభినందించారు.

ఇంటర్మీడియెట్ దశ కీలకం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఫేర్‌వెల్ బుధవారం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ నారాయణ స్వామి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి ఇంటర్మీడియెట్ దశ కీలకమన్నారు. నాడు-నేడు పథకం ద్వారా నరసన్నపేట కళాశాల దశ మారిందన్నారు. రూ.1.50 కోట్ల నిధులు వచ్చాయని, మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కార్పొరేట్ కళాశాలకు దీటుగా తీర్చి దిద్దడం జరుగుతుందన్నారు. కళాశాల అధ్యాపకులు పలువురు పాల్గొని విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న సీఐ వేణుగోపాలరావు

కొత్తూరు: పోక్సో చట్టంతోపాటు మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలపై అవగాహన అవసరమని సీఐ ఆర్.వేణుగోపాలరావు అన్నారు. ఓ ప్రైవేట్ కాలేజీలో విద్యార్థినులకు పలు చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడు మహిళలు ఇతరుల నుంచి మోసపోరన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల కార్మిక చట్టంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో చోరీ

పోలాకి: మండల కేంద్రంలోని ఇందిరానగర్ వద్ద శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ పూజారి జాడ వెంకట కూర్మారావు బుధవారం ఉదయం చూసేసరికి హుండీతోపాటు, వెండి పూజా సామగ్రి కనిపించలేదు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరా రిసీవర్‌ను సైతం పట్టుకపోయారు. వెంటనే పూజారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న సమరసతసేవా సమితి సమయోజక్ బృందం ఆలయాన్ని పరిశీలించి పోలీసులు తక్షణం కేసు నమోదు చేసి దొంగలను పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు.

మహిళలకు ఆర్థిక ఆసరా

- వైఎస్సార్‌సీపీతో సుపరిపాలన
- జగనన్న హయంలో మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ
- డ్వాక్రా సంఘాలకు ఇచ్చే ప్రతీ రూపాయి సద్వినియోగం
- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస:

ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో స్వయం సహాయక సంఘాలకు రుణమాఫీ పూర్తి చేసి మహిళా పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానం సంపాదించుకున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం పూర్తి చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్ చరిత్ర సృష్టించారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళలకే కేటాయిస్తూ వారికి తగిన గౌరవాన్ని కల్పించారన్నారు. రాష్ట్రంలో మళ్లీ తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, అందరికీ మంచి జరుగుతుందన్నారు. మహిళల చేతికిచ్చే ప్రతి రూపాయి సద్వినియోగం అవుతుందని గట్టిగా నమ్మే నాయకుడు సీఎం జగన్ అని అన్నారు. వైఎస్సార్ ఆసరాలో భాగంగా నాలుగో విడతలో ఆమదాలవలస నియోజకవర్గానికి రూ.30.74 కోట్ల నిధులను విడుదల చేశామని, నాలుగు విడతల్లో మొత్తంగా రూ.122.95 కోట్ల నిధులను అందించినట్లు చెప్పారు. సీఎం జగన్ చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఆసరా నిధుల నమూనా చెక్కును మహిళలకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, డీఆర్‌డీఏ పీడీ డి.విద్యాసాగర్, మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, ఏఈ కె.అప్పలనాయుడు, ఆమదాలవలస నియోజవర్గం, పురపాలక, ఆమదాలవలస, పొందూరు, సరుబుజ్జిలి, బూర్జ మండలాల ముఖ్య నాయకులు కేవీజీ సత్యనారాయణ, కర్నెన దీప, కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీలు సురవరపు నాగేశ్వరరావు, లోలుగు కాంతారావు, బెజ్జిపురం రామారావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, ఖండాపు గోవిందరావు, పప్పల రమేష్‌కుమార్, బేవర మల్లేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షులు కోయిలపు చంద్రశేఖర్, కొంచాడ రమణమూర్తి, బగాది నారాయణమూర్తి, గురుగుబెల్లి శ్రీనివాసరావు, సచివాలయాల మండల కో ఆర్డినేటర్లు బాడన కృష్ణ, గుమ్మడి రాంబాబు, అత్తులూరి రవికాంత్, బొడ్డేపల్లి నిరంజన్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ బాడన సునీల్ పాల్గొన్నారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, నాయకులు



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



వైఎస్సార్ ఆసరా కింద నాలుగేళ్లలో సుమారు రూ.65 వేలు లబ్ధి చేకూరింది. బ్యాంకులో తీసుకున్న రుణం మొత్తం మాఫీ చేయడం సంతోషంగా ఉంది. మా మనుమలకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా రుచికరమైన భోజనం, జగనన్న విద్యా కానుకలు అందుతున్నాయి. మా బతుకులకు భరోసా కల్పించారు. సీఎం జగన్ చేసిన మేలు మరిచిపోలేనిది.

– పోలాకి గౌరి, ఆమదాలవలస గేటు, ఆమదాలవలస మున్సిపాలిటీ

పెద్ద కొడుకులా ఆదుకుంటున్నారు



మహిళలకు అన్ని విధాలా చేదోడుగా ఉండి, మా బతుకుల్లో వెలుగులు నింపుతూ పెద్దకొడుకులా సీఎం జగన్ ఆదుకుంటున్నారు. పథకాలన్నీ మాకు అందిస్తున్నారు. ఐదేళ్లుగా మాకు ఆర్థిక భారం లేకుండా అన్నివిధాలా ముందుకు తీసుకెళ్తున్నారు. ఆసరా సొమ్ములు చెల్లించి మమ్మల్ని అప్పుల ఊబిలోంచి బయటకు తెచ్చారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా రావాలని కోరుకుంటున్నాం.

– పోతల ఆదిలక్ష్మి, సకలపాలెం, సరుబుజ్జిలి మండలం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



మా గ్రూపు పేరు శ్రీదుర్గ ఎస్‌హెచ్‌జీ. మాది ఆమదాలవలస మున్సిపాలిటీ, హడ్కోకాలనీ, మా అందరికీ రూ.8,34,853 రుణమాఫీ అయింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసి అక్కాచెల్లెమ్మలకు అండగా నిలిచారు. గత ప్రభుత్వంలో రుణమాఫీ చేస్తామని చంద్రబాబు మహిళలను మోసం చేశారు. మహిళలకు ఆదుకున్న సీఎం జగన్‌కు అండగా ఉంటాం.

– కోనారి జ్యోతి, శ్రీదుర్గ ఎస్‌హెచ్‌జీ, హడ్కోకాలనీ, ఆమదాలవలస మున్సిపాలిటీ

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యం

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ్మినేని చిరంజీవినాగ్

ఆమదాలవలస రూరల్: పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థతో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. మండలంలోని దూసి గ్రామ సచివాలయం పరిధిలో గల నెల్లిమెట్టులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ లబ్ధిదారులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతో ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి మంచి గుర్తింపు ఉందన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. అర్హత ఉండి పథకాలు రాని కుటుంబాలు ఉంటే వాటిపై ఆరా తీసి అక్కడిక్కడే పరిష్కరించే విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ చేస్తున్నామన్నారు. సర్పంచ్ చిగురుపల్లి దశరథ, ఈఓపీఆర్డీ గోవిందరావు, ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్, ఏపీఓ లక్ష్మీనరసమ్మ, ఏపీఎం కూర్మారావు, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నలక్ష్మి, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



నెల్లిమెట్టులో మహిళకు అభివాదం చేస్తున్న చిరంజీవినాగ్

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

హిరమండలం: సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని డీఈఓ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలో ఎంఈఓ-2గా విధులు నిర్వహించిన తూలుగు షన్ముఖరావు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కల్లటలోని విజయ గార్డెన్స్‌లో సన్మాన సభ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఈఓతో పాటు డిప్యూటీ ఈఓ పగడాలమ్మ హాజరయ్యారు. డీఈఓ మాట్లాడుతూ మండలానికి రెండో ఎంఈఓగా నియమితులైన అనతికాలంలోనే షన్ముఖరావు మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేశారని అభినందించారు. షన్ముఖరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూలుగు మేనక, ఎంఈఓ రాంబాబు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరుపతిరావుమాస్టారు తదితరులు పాల్గొన్నారు.



షన్ముఖరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రహదారి పనుల పరిశీలన

నరసన్నపేట: రావులవలస రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామీణ రోడ్ల అభివృద్ధి పథకంలో భాగంగా నాలుగేళ్ల క్రితం గుండవల్లిపేట నుంచి రావులవలస వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ వివిధ కారణాలతో కొద్ది మేర పనులు చేసి మిగిలిన పనులు చేపట్టడంలో తీవ్ర జాప్యం చేశారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీనిని గమనించిన ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కాంట్రాక్టర్, ఇంజినీర్లతో మాట్లాడి పనులను పునఃప్రారంభింపజేశారు. రోడ్డు పనులు పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ పది రోజుల్లో రోడ్డు పనులు పూర్తికానున్నాయన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి



భోజనాలను పరిశీలిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయ అధికారి బాలాజీ

- సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయ అధికారి బాలాజీ

పాతపట్నం: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఇప్పటినుంచే విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయ అధికారి ఎస్.బాలాజీ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలెంలో ఉన్న డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని, ఎటువంటి ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. పదో తరగతి, ఇంటర్‌లో మెరిగైన ఫలితాలు రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు అంగ్లంపై పలు పశ్నలు వేసి జవాబులు రాబట్టారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఆర్.వి.కృష్ణతార, కొల్లివలస గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ వి.అర్చన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌరహక్కుల రక్షణకు కృషి



మాట్లాడుతున్న మండల అధికారులు

హిరమండలం: పౌర హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని తహసీల్దార్ బి.మురళీమోహన్ అన్నారు. గులుమూరులో పౌరహక్కుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎక్కడైనా పౌరహక్కులకు భంగం వాటిల్లితే అధికారులను ఆశ్రయించాలని సూచించారు. రాజ్యాంగబద్ధంగా పౌరులకు అనేక హక్కులు లభించాయని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ ఎస్.కోటేశ్వరరావు మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి



మైక్‌లో ప్రచారం చేస్తున్న దృశ్యం

హిరమండలం: స్థానిక పీఏసీఎస్‌లో రుణాలు తీసుకున్నవారు రీ షెడ్యూల్ చేసుకోవాలని అధ్యక్షుడు ఏవీ సురేష్ సూచించారు. బుధవారం మైక్ ద్వారా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 29 వరకు 7 శాతం వడ్డీతో రుణాలు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. ఆ తరువాత 13 శాతం వడ్డీ పడుతుందన్నారు. రైతులు 1-బీ, ఆధార్ కార్డు జిరాక్స్, రెండు ఫొటోలు, బ్యాంక్ అకౌంట్, రేషన్ కార్డు జిరాక్స్‌తో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు పలువురి విద్యార్థుల ఎంపిక



స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో టీచర్

హిరమండలం: మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికయ్యారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న టి.జీవన్‌కుమార్, ఎస్.కీర్తన, ఎస్.హరితలు ఎంపికైనట్టు హెచ్ఎం కేశవరావు తెలిపారు. ఎంపికైన వారికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అంబావల్లి పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కప్పరోతు లిఖిత ఎంపికైనట్టు హెచ్ఎం తెలిపారు. లిఖితకు ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు

హిరమండలం: ప్రత్యేకావసరాల గల చిన్నారులకు ఫిజియోథెరపీ వరమని.. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని ఐఈఆర్టీ వైద్యులు గ్రేసీ ప్రీతి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేకావసరాలగల చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. మండలం నలుమూలల నుంచి ప్రత్యేకావసరాలగల చిన్నారులు శిబిరానికి వచ్చారు. ఐఈఆర్టీలు సీతంనాయుడు, గోవిందరావు పాల్గొన్నారు.



చిన్నారులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న ఐఈఆర్టీ

వైఎస్సార్‌సీపీ విజయమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపు

పాతపట్నం: వైఎస్సార్‌సీపీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని, వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. నియోజకవర్గ కేంద్రం పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రెండు నెలలు ప్రతీక్షణం ఎంతో విలువైందన్నారు. 2024లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేలా అందరూ కృషి చేయాలన్నారు. టీడీపీ నాయకుల అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్లాన్నారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. రానున్న రోజుల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. రెడ్డి రామారావు, ఉదయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షులు బాలరాజు, సురేష్, సూర్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ అర్జునుడు, పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణ, ప్రసాదరావు, విష్ణుమూర్తి, చంద్రయ్య, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్పీకర్ పరామర్శ

పొందూరు: మండలంలోని తోలాపి గ్రామంలో పలు కుటుంబాలను స్పీకర్ తమ్మినేని సీతారాం బుధవారం పరామర్శించారు. డీఎస్పీ పాత్రుని రామచంద్రరావు తల్లి, వైఎస్సార్‌సీపీ నాయకులు మొదలవలస చక్రధర్, గురుగుబెల్లి యువరాజుల మాతృ మూర్తులు ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.



పరామర్శిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

క్షేత్ర పర్యటనలతో విజ్ఞానం

పొందూరు: మండలంలోని లోలుగు కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులపై అవగాహన కల్పిస్తూ బుధవారం క్షేత్ర పర్యటన జరిపినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ విజయకుమారి తెలిపారు. పొందూరులోని ఏఎఫ్‌కేకే సంఘంలో ఖాదీ వస్త్రాల తయారీ ప్రక్రియతో పాటు కార్మికుల నైపుణ్యాలను విద్యార్థులు పరిశీలించినట్లు తెలిపారు. వృత్తి విద్యా కోర్సు ట్రైనర్ బి.మనెమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఖాదీ వస్త్రాల తయారీని పరిశీలిస్తున్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో 13 మందికి గాయాలు

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రం ఎల్.ఎన్.పేటలోని పెట్రోల్‌బంక్ సమీపంలో బుధవారం అలికాం - బత్తిలి ప్రధాన రోడ్డులో జరిగిన ప్రమాదంలో 13 మందికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హిరమండలం మండలం కొండరాగోలు గ్రామానికి చెందిన బి.చిన్నమ్మి, అమ్మన్నమ్మ, టి.సత్యవతి, శాంతి, కె.ఆరుద్రమ్మలతో పాటు మరి కొంత మంది హిరమండలంవైపు నుంచి సరుబుజ్జిలివైపు ఆటోలో వస్తుండగా పెట్రోల్‌బంక్ సమీపానికి వచ్చేసరికి అదుపుతప్పి బోల్తాపడింది. వెంటనే స్థానికులు అప్రమత్తమై క్షతగాత్రులను ఎల్.ఎన్.పేట పీహెచ్‌సీకి మరో ఆటోలో తరలించారు. డాక్టర్ సునీత, సిబ్బంది క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. తీవ్రగాయాలైన ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం 108లో శ్రీకాకుళం రిమ్స్ తరలించారు.



పొలంలో బోల్తాపడిన ఆటో